

రామన్నపేట పాఠశాలలో టీ-శాట్ ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయుడు



రామన్నపేటలో పాఠశాల ఆవరణలో సరస్వతీ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన గ్రామస్తులు (ఫైల్)

# సకల వసతుల సర్కారు బళ్లు

కనీస సౌకర్యాలు లేక సమస్యలతో కొట్టుమిట్టాడిన రామన్నపేట ప్రభుత్వ పాఠశాలలు ప్రస్తుతం సకల వసతులతో కళకళలాడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు-మనబడి'తో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాల తన స్వరూపానే మార్చుకున్నాయి. అధునాతన టాయిలెట్స్, విశాలమైన వంట గది, తరగతి గదిలో డ్యూయల్ డెస్కులు, గ్రీన్ బోర్డులు, డిజిటల్ క్లాస్ రూంలు. ఇలా సకల వసతులు కల్పించుకొని కార్పొరేట్‌కు దీటుగా తయారయ్యాయి.

– మల్యాల, జూలై 3

- 'మన ఊరు మన బడి'తో మారిన రూపురేఖలు
- కార్పొరేట్‌కు దీటుగా రామన్నపేట ప్రభుత్వ పాఠశాలలు
- స్కూళ్లలో అన్ని వసతుల కల్పన
- టీ-సాట్ నేతృత్వంలో డిజిటల్ పాఠ్యాంశాల బోధన



రామన్నపేటలోని ప్రభుత్వ పాఠశాలల ముఖద్వారం


మల్యాల, జూలై 3: మన ఊరు మన బడి కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులతో రామన్నపేట ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల సర్వాంగ సుందరంగా తయారయ్యాయి. సకల సౌకర్యాలు కల్పించుకొని కార్పొరేట్‌కు దీటుగా రూపుదిద్దుకున్నాయి. మన ఊరు మనబడి మొదటి విడుతలో రెండు పాఠశాలలు ఎంపిక కాగా అన్ని వసతులు కల్పించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యుద్దీకరణ కోసం రూ.85,428, తాగునీటి వసతి ఏర్పాటు కోసం రూ.37,177, పలు మరమ్మత్తుల పనుల కోసం రూ.2,42,713 వెచ్చించారు. బాలబాలికలకు వేర్వేరుగా రూ.3,50,000తో టాయిలెట్స్ నిర్మించారు. సీపీఎం గ్రాంట్ కింద గ్రీన్‌చార్ట్ బోర్డులు, డ్యూయల్ డెస్కులు ఏర్పాటు చేశారు. పాఠశాలకు అందమైన రంగులు వేయించారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యుద్దీకరణ కోసం రూ.2,42,751, తాగునీటి వసతి కోసం రూ.1,57,817, బాలబాలికలకు వేర్వేరుగా టాయిలెట్స్ కోసం రూ.7లక్షలు, ప్రహరీ నిర్మాణానికి రూ.13 లక్షలు వెచ్చించారు. రూ.1.20 లక్షలతో గ్రీన్‌బోర్డులు, రూ.13 లక్షలతో డ్యూయల్ డెస్కులు, డిజిటల్ క్లాస్ రూంల నిర్వహణకు ప్రొజెక్టర్ కమ్ స్క్రీన్, వంటగది, డైనింగ్ హాల్ నిర్మాణంతో పాటు పూర్తిస్థాయిలో ఫర్నీచర్ అందజేయడంతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు పాఠశాలలు రూపుదిద్దుకున్నాయి.

### డిజిటల్ తరగతులు

విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేయడంతో పాటూ రెండు జతల యూనిఫాంలను ప్రభుత్వపరంగా పాఠశాలలో అందజేస్తున్నారు. మన ఊరు మన బడితో పాఠశాల సుందరీకరణ అవడంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో బోధన చేపట్టడంతో ఈ విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పాఠశాలలోని డిజిటల్ పాఠ్యాంశాల తరగతి గదులను ఇటీవలే చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలంగాణ విద్యాదినోత్సవ దశాబ్ది వేడుకల్లో భాగంగా ప్రారంభించారు. సర్పంచ్ గడ్డం జలజ– మల్లారెడ్డి దంపతులు ఆలయంలో సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సువిశాలమైన ప్రాంగణం, టీసాట్ ద్వారా ఆన్‌లైన్ క్లాసుల నిర్వహణ, ప్రభుత్వ ఉపాధ్యాయులతో ఆంగ్ల మాధ్యమంలో బోధన, ప్రైవేటుకు దీటుగా సౌకర్యాలు ఉండడంతోపాటు బాలికలకు హైజెనిక్ కిట్లను సైతం అందిస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు సైతం మొగ్గు చూపుతున్నారు.



రామన్నపేటలో డిజిటల్ తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్ (ఫైల్)



డ్యూయల్ డెస్కులపై కూర్చుని క్లాసులు వింటున్న విద్యార్థులు

## ఆలయంలో పౌర్ణమి వేడుకలు

హుజూరాబాద్‌టౌన్, జూలై 3: హుజూరాబాద్ పట్టణంలోని సాయిబాబా ఆలయంలో సోమవారం గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అఖండ దీపారాధన, శ్రీ దత్తాత్రేయస్వామి పూజ నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం చేశారు. శ్రీ శివరామకృష్ణ భజన మండలి హుజూరాబాద్, శ్రీ రామానంద భజన మండలి కొత్తపల్లి, శ్రీ భవానీశంకర్ భజన మండలి, శ్రీ రామాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### చొప్పదండిలో..

చొప్పదండి, జూలై 3: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, భక్తులు బాబాకు అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దండె లింగన్న, దూస రాము, కొత్తపల్లి లక్ష్మణ్, చిలుకనూరి రాజయ్య, నలుమాచు రామకృష్ణ, మారుతి, మంచికట్ల విఠల్, శ్రీనివాస్, అర్చకుడు శ్యాం పాల్గొన్నారు.



హుజూరాబాద్‌టౌన్: పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

## ఈవీఎంల గోడౌన్ తనిఖీ

కలెక్టరేట్, జూలై 3 : ఈవీఎంలు భద్రపర్చిని గోదామును సోమవారం ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాబోయే అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకొని జిల్లాలోని పోలింగ్ స్టేషన్లలో ఏర్పాటు చేయనున్న ఈవీఎం యంత్రాలను తనిఖీ చేస్తున్నట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీల సమక్షంలో చేపడుతున్న ఎఫ్‌ఎల్‌సీ, ఎన్నికల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఎఫ్ఎల్సీ నిర్వహణ, ఈవీఎంలు గోడౌన్‌లోకి ప్రవేశించడం నుంచి ఈవీఎం బ్యాలెట్ యూనిట్, కంట్రోలింగ్ యూనిట్, వీవీపాట్ యంత్రాల మొదటి దశ చెకింగ్, మాక్ పోల్ నిర్వహణ, ఈవీఎంలను భద్రపరిచే గది, సీసీ కెమెరాల ద్వారా నిర్వహిస్తున్న వెబ్ కాస్టింగ్, అలారం, భద్రతా సిబ్బంది, బ్యారికేడింగ్ తదితర విషయాలను పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, ఆర్డీవో ఆనంద్ కుమార్, పార్టీల ప్రతినిదులు సత్తినేని శ్రీనివాస్, మడుపు మోహన్, ఎర్రవెల్లి రవీందర్, నాంపల్లి శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

## ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

రాంనగర్, జూలై 3 : నగరంలోని శర్మనగర్‌లో ప్రైవేట్ దవాఖాన భాగస్వామి ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం వన్‌పల్లికి చెందిన రేకుల మహిపాల్‌రెడ్డి డాక్టర్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి భాగస్వామ్యంలో శర్మనగర్‌లో దవాఖాన ఏర్పాటు చేశారు. మహిపాల్‌రెడ్డి గ్రామంలో వన భోజనాలు ఉండడంతో శనివారం భార్యతో కలిసి వెళ్లి ఆదివారం రాత్రి తిరిగి కరీంనగర్‌కు వచ్చాడు. సోమవారం ఉదయం సాయి అనే వ్యక్తి మహిపాల్‌రెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డికి ఫోన్ చేసి మహిపాల్‌రెడ్డి చనిపోయినాడని సమాచారమిచ్చారు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు వచ్చి దవాఖానలోని పై అంతస్తులోకి వెళ్లి చూడగా బెడ్‌షీట్‌తో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉన్నాడు. ప్యాంటు జేబులు తెరిచి ఉండగా అతడికి సంబంధించిన ఫోన్లు భాగస్వామి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ దగ్గర ఉన్నాయని, భర్త మృతిపై అనుమానాలున్నాయని మహిపాల్ రెడ్డి భార్య రేఖ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొంతకాలంగా డాక్టర్ ప్రవీణ్, ఆయన భార్య ప్రత్యూషతో వ్యాపార విబేధాలున్నాయని, వారు చేసిన ఇబ్బందులు చెప్పుకుంటూ బాధపడేవాడని, తన భర్త మరణానికి ఆ ఇద్దరే కారణమని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కారు బోల్తాపడి ఒకరి మృతి

రాంనగర్, జూలై 3: నగర శివారులోని రాజీవ్ రహదారి బైపాస్‌లో సోమవారం తెల్లవారుజామున ఓ కారు అతివేగంతో డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు, అజ్మత్‌పురాకు చెందిన అఫ్జల్ రెహమాన్ పెళ్లి షాపింగ్ చేసేందుకు ఆదివారం ఉదయం బంధువులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో కరీంనగర్ బైపాస్ రహదారిలో వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి అతివేగంతో డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో షబానా అంజుమ్‌కు తీవ్ర గాయాలు కాగా రుక్సానా బేగం, ఫాతిమా, మీర్జా సమీర్, మహమ్మదీ ఫాతిమాకు గాయాలయ్యాయి. గాయపడిన వారందరినీ 108 ద్వారా ప్రైవేట్ దవాఖానకు తరలించారు. షబానా అంజుమ్ చికిత్స పొందుతూ మృతి చెందింది. మిగతా వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతురాలి భర్త రెహమాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మహిపాల్‌రావు

## ఉపాధ్యాయులకు సన్మానం

గంగాధర, జూలై 3 : బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాల 10వ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి హెచ్‌ఎం టీవీ నిర్వహించిన పోటీల్లో బెస్ట్ స్కూల్ అవార్డును అందుకుంది. సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురాం, ఉపాధ్యాయులను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, నాయకులు సన్మానించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం స్వామి, సాయిల్ల సంతోష్, తడగొండ అజయ్, పంచాయతీ కార్యదర్శి మల్లేశం పాల్గొన్నారు.

## స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు

నగర శివారులోని తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బీ లావణ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ డాటీ సైన్స్, బీజడ్‌సీ ఎంపీసీఎస్, ఎంబీజడ్‌సీ, బీకాం సీఏ, బీఏ సీఏ కోర్సుల్లో ఈ నెల 10లోపు అర్హులైన ఎస్టీ, ఎస్సీ, బీసీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని వెల్లడించారు. పూర్తి వివరాలకోసం 7901097692 సెల్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## హత్య కేసులో నిందితుడి అరెస్ట్

రాంనగర్, జూలై 3 : భగత్‌నగర్ క్రిస్టల్ ప్లాజాలో గత నెల 29న హత్యకు గురైన వివాహిత కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు వన్‌టౌన్ సీఐ రవికుమార్ తెలిపారు. భగత్‌నగర్‌లో రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడి పెట్టి డబ్బుల కోసం వెళ్లిన సరిత హత్యకు గురైన సంగతి తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు నిందితుడు పైడిపాల వెంకటేశ్వర్లు అలియాస్ వెంకటేశ్‌ను సోమవారం కరీంనగర్ బస్టాండ్‌లో అరెస్ట్ చేశారు.

## విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

తెలంగాణచౌక్, జూలై 3: విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగడికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని ప్రెస్ భవనంలో జిల్లాకమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. వాటి అనుమతులు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రమేశ్, తిరుపతి, రాజేశ్ పాల్గొన్నారు.